
కథానిక:

# పెద్దపదవి

శ్రీ ద్విదేదుల సోమనాథశాస్త్రి



వెంకన్న పంతులు చేసిన మోసానికి రామస్వామి చాలా విచారించాడు. డబ్బు అయిపోయింది కాని ఫలితం లేదు. ఆ ఆరునెల్లనుండి వెంకన్న పంతులు మీద తను ఎంతో ఆశపెట్టుకొన్నాడు. అతని వల్ల తనకూ ఒక గౌరవమైన పదవి వస్తుందని, ఆమాత్రం వస్తే మిగతా పని నెరవేర్చుకొనే శక్తి తనలో ఉందని తనకు బాగా తెలుసు కాని అతడు తన సొమ్ము తిని తన నింత అన్యాయం చేస్తాడని యెన్నడూ తలవలేదు. వెంకన్న పంతులు చేసిన యీ ఘోరం తలుచుకుంటే రామస్వామికి పూర్వం అతని కిచ్చిన లంచాలూ అవీ యివీ గుర్తుకొచ్చి గుండె గభేలుమంటుంది! యిలా యితను ఒక్కడే కాదు - మరో యిద్దరుకూడా రామస్వామి డబ్బు తిని ఆఖరికి లాభంలేదని పొమ్మన్నారు. కాని - రామస్వామికి యింకా ఏదైనా పదవి సంపాదించాలనే కండూతి పోలేదు. అందుకే ఇంత డబ్బు పోయినా నాల్గుతిట్లు తిట్టి ఊరుకున్నాడు. ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

రామస్వామి భార్య లక్ష్మికిమాత్రం యిది ఏమాత్రం నచ్చలేదు. ఎన్నోసార్లు యిలా డబ్బు పాడుచెయ్యవద్దని చెప్పి విసిగి ఊరుకుంది! రామస్వామి ఎలాటివాడయినా లక్ష్మినిమాత్రం సాధ్వి అని చెప్పకోక తప్పదు. అన్నిటిలోనూ ఆమెలాటి మనిషి లేదనే చెప్పకోవాలి - ఆమెకి పిల్లలు లేరన్న చింత తప్ప వేరే చింత మరేమీ లేదు!

పిత్రార్జితం రామస్వామిని ఉద్యోగం చేయనిచ్చింది కాదు. ఎంత డబ్బయినా ఖర్చుచేసి ఓ పెద్ద పదవి సంపాదించాలని రాత్రి పగలూ ఆలోచించేవాడు! అవిధంగానే ఏభైవేలవరకూ ఖర్చుచేసి రెండేళ్ళ క్రితం చైర్మన్ పదవి సంపాదించాడు. కాని యితని నిర్వహణ రుచి చూసినతర్వాత మళ్లీ ఎన్నికలలో ఒక్క ఓటుకూడా వచ్చిన పాపాన్ని పోలేదు - ఆఖరికి ఓటు ఒక్కింటికి పది రూపాయలు ఇస్తానన్నా లాభం లేకపోయింది! ఆతర్వాత వెంకన్నపంతుల్లాంటివారిని ఎందర్నో ఆశ్రయించి వారికి మస్తుగా మేపినా కృతకృత్యుడు కాలేకపోయాడు.

వెంకటేశంగారు రామస్వామి వున్న వూరికి చెందిన రాష్ట్రానికి మంత్రులలో ఒకడు. ఆయనలో కొన్ని లోపాలున్నా కార్యనిర్వహణలో గట్టిబుర్రే అని చెప్పకోవచ్చు. ఆయన గంభీరాకృతిని చూసేసరికి ఎవడో మహానుభావుడని తోచక తప్పదు. ఈయనకి చెందిన దగ్గరి బంధువులందరూ దరిదాపు యిలాటి పదవులు ఆక్రమించినవారే! వెంకటేశంగారు పదవిలోనికి వచ్చినతరువాతే వారి బంధువులందరూ కూడా పదవులు సంపాదించారంటే— వెంకటేశంగారి కృషికి ఎంతైనా మెచ్చుకోవాలి! ఈ మూడు సంవత్సరాలబట్టి ఆయన నిర్వహణలో ఏలోపం లేదు కాని యీమధ్య ఓ యిద్దరి పెద్దమనుష్యులవద్ద లంచం పుచ్చుకొన్నాడని బయటికి తెలిసిపోవడంవలన తన ప్రఖ్యాతికి కొంచం మబ్బు కమ్మింది. ఇంతలో తిరిగీ ఎన్నికలు ప్రారంభం అవడం వల్ల వెంకటేశంగార్కి తనని తిరిగి ఎన్నుకుంటారో లేదో నన్నభయం కల్గింది— అందుకనే ముందుగానే రాష్ట్రం అంతా పర్యటనచేసి ప్రజల్ని తనవైపు తిప్పకోడానికని ప్రతీ పల్లెకి, పట్నానికి బయలుదేరాడు. కొంతవరకూ తిరిగి యింక భయం లేదని గుండె నిబ్బరం చేసుకున్నాడు— ఆ మర్నాడు రామస్వామి ఉన్న ఊరికి వెళ్లి ఉపన్యాసం యివ్వడానికి నిశ్చయించుకొని ముందుగానే కబురుచేశాడు. ఈయన కీర్తిని, ఉదారస్వభావాన్నివిని, రామస్వామి యీయన వల్లనైనా తనూ ఓపదవి సంపాదించవచ్చుకదా అనే ఆశతో యీయనికి అఖండ స్వాగతం యిచ్చి సత్కరించడానికి నిశ్చయించుకున్నాడు.

ఆ రోజుని రామస్వామి తన యిల్లు చక్కగా ముస్తాబు చేయించేడు. హడావుడిగా అటుంచి యిటు ఇటుంచి అటూ తిరుగుతూ అందరికీ పనులు పురమాయిస్తున్నాడు. క్రిందటి రాత్రంతా వాల్ పోస్టర్లు రాయించడంలోనూ మిగతా పనుల్లోనూ మునిగియుండడంవల్ల అతని కళ్లు చింత నిప్పల్లా ఉన్నాయి. ఊరిలో ఎక్కడ పడితే అక్కడ "శ్రీ వెంకటేశంగారి ఆగమనం" అనే కాగితాలు అటించబడ్డాయి. సాయంత్రం అయ్యేసరికి మైదానంలో వేదిక

చాలా అందంగా తయారు చేయించి, వెంకటేశంగార్ని ఎదుర్కోడానికి టాక్సీతో సహా స్టేషన్‌కి వెళ్లేడు. విలువయిన చమ్కీ దండలు కొన్నాడు. బండీ వచ్చేలోపు నిత నింకా చెయ్యవలసిన పనులు ఏమైనా ఉండిపోయాయేమో నని ఆలోచించేడు. ట్రైను రాగానే వెంకటేశంగార్కి స్వాగతం యిచ్చి తిన్నగా ఉపన్యాస వేదికకి తీసుకుపోయాడు.

వెంకటేశంగారి ఉపన్యాసానికి మొదట రామస్వామిగారు రెండు ముక్కలు వెంకటేశం గురించి, ఆయన ప్రతిభ గురించి ఆయన దేశసేవగురించి పొగిడి చెప్పి కూర్చున్నాడు. వెంకటేశంగారు తన ఉపన్యాసంలో రామస్వామిని అభినందిస్తూ చెప్పేసరికి రామస్వామి పొంగిపోయాడు.

కార్యక్రమంఅంతా అయిన తర్వాత రామస్వామి వెంకటేశంగార్ని తనింటికి అతిథిగా తీసుకువచ్చాడు. ఇది యితనికి కొత్తకాదు. ఆపాటి యీపాటి పేరున్నవాడు అపూరుకొచ్చి రెండు ముక్కలు ఉపన్యాసం చెప్పేసరికి ఆయనవల్ల ఏదో పెద్ద పెన్నిధి వచ్చినట్టు వాడిని తనింట గౌరవించడంఅంతా అయిన తర్వాత నిట్టూర్పు విడవడంపరిపాటే! అయితే యింతకుపూర్వం వచ్చినవారికీ యీ వెంకటేశంగార్కీ వ్యత్యాసం ఏమంటే - వారందరికన్నా యీయన కొంచెం ఎక్కువ పదవిలో ఉన్నవాడు. అందరికీ కాస్తో కూస్తో తెలిసినవాడూను. ఆయన పేరు చాలాసార్లు పేపర్లలో పడింది. ఉపన్యాసాలుకూడా కొన్ని పడ్డాయి-యిన్నిటికన్నా ముఖ్యమైంది రామస్వామికి యీయన్ని చూసేసరికి ఏదో తెలియని అభిమానంపుట్టుకురావడమే! ఆయనవల్ల తనకు పదవి తప్పకుండా రాగలదనే నమ్మకం రూఢిగా స్థిరపడింది. ఆయనకోసం ఎంత ఖర్చుచేసినా వృథా పోదనే గట్టిగా నమ్ముతున్నాడు. ఎలా అయితేనేం రామస్వామిగార్కి వెంకటేశంగారిమీద గట్టి నమ్మకం కలిగిపోయింది - ఆయన్ని చూసేసరికి ఏదో పెద్ద దేవతని చూస్తున్నట్టు — ఆయనతో మాటాడేసరికి తన కేదో చెప్పలేని గౌరవం కలుగుతున్నట్టు - ఆయనప్రక్కని కూర్చునేసరికి అప్పుడే తనూ ఓ పదవిలో అధికారం చెలాయిస్తున్నట్టూ భావిస్తున్నాడు. తనకు శక్తి ఉన్నంతమట్టుకు ఏ లోపం రానీయకండా ఆయన్ని గౌరవించాడు - ఆయనకూడా యీయనతో ఏకీభవించడం ఔనన్నదల్లా అవుననడం కాదన్నదల్లా కాదనడం మూలాన రామస్వామి పరీ సంతోషం పట్టలేకపోయాడు.

రామస్వామి వెంకటేశంగారు భోజనానికి కూర్చున్నారు. నెయ్యి వడ్డించమని రామస్వామి లక్ష్మిని కేక వేశాడు. లక్ష్మి నేయి పట్టుకువచ్చి రామస్వామికి వేసి తరవాత వెంకటేశంగారికి వేసింది. ఆమె వంగి వడ్డిస్తున్నపుడు వెంకటేశం ఆమెవైపేచూస్తూ ఒక్కనిముషం ఉండిపోయాడు. ఆమెనుచూసి ఒక్కగుటక మింగేడు. యీఆలస్యంలో చెయ్యిపూర్తిగా నేయితో నిండిపోవడంవల్ల మండెల మీదుగా కూడా కారిపోతోంది. వెంకటేశం తెలివి తెచ్చుకొని 'చాలండి! చాలు - చాలు!' అని చెయ్యి తిప్పడంలో యింకా నెయ్యి పోస్తూన్న లక్ష్మిచేతిలోని మిల్లిగరిటి క్రింద పడిపోయింది! యీ వాలకం అంతా చూసి లక్ష్మి మొహం చిట్లించుకోబోయింది. కాని, అంత పెద్దమనిషి, అధికారి ఏంచేస్తాడో అని భయపడి వెళ్లిపోయింది, రామస్వామి తనూ, తన పదవి, అధికారం, యీ గొడవల్లో పడి యీవిషయంగమనించనేలేదు. తక్కిన వంటకాలన్నీ లక్ష్మి వంటమనిషిచేతే వడ్డింపచేసింది. లక్ష్మి మరి రాకపోవడం వెంకటేశంగార్కి మనస్సు చివుక్కుమంది! ఎలాగయితేనేం భోజనాలు అయింతర్వాత లక్ష్మికి తాంబూలపు పళ్లెం అందించక తప్పింది కాదు. వెంకటేశంముందుగాను తన భర్త వెనకను కూర్చొని ఉండటంవల్ల వెంకటేశాన్ని దాటుకుపోవలసి వచ్చింది. వెంకటేశం ఆమె వచ్చినపుండి అదోలా అమెవైపే చూస్తూన్నాడు! యీసారి మాత్రం లక్ష్మికి ఒళ్లుమండింది. చిరాకుగా వెంకటేశంవైపు కళ్లు పెద్దవిచేసి చూసి వెళ్లిపోయింది. రామస్వామికి యిదంతా చూడగానే చెప్పలేని కోపం వచ్చేసింది. కాని, ఏం చేయగలడు - పెద్ద అధికారి? ఏమో ఏంచేస్తాడో! అని కోపం తనలోనే అణుచుకున్నాడు. తన కోర్కెని వెంకటేశంతో చెప్పడానికిదే మంచి సమయం అని ఆయన్ని మాటల్లోకి దింపేడు!

'అయితే మీకు ప్రతికక్షిగా ఎవరు నిలబడినట్టు?'

'ఇప్పటికి ఎవరూ నిలబడలేదు కాని నరసింహం అనే ఆయన నిలబడవచ్చునని అందరూ అంటున్నారు!'

'అలాగా - ఎవరయితే నిలబడనీయండి. యీసారికూడా మీకే జయం తప్పదు -'

'ఏమో ఎవరు చెప్పగలరు...ఆ భగవంతుడి దయ'

'మిమ్మల్ని చూసి మీ ఉపన్యాసం విన్న తర్వాత మరొకరికి ఓటు వెయ్యగలరా?'

'ఆయనకూడా తక్కువవాడు కాడు!'

'ఏమైనా సరే మీలాంటివారు మా రాష్ట్రానికి ఉండడం అరుదు'

'అది మీ అందరి దయే కదూ!'

'ఇక్కడనుండి మీ తరువాత కార్యక్రమం ఏమిటి?'

'ఇక్కడ ఇంకా ఒక రోజు పని ఉంది! తరువాత యీ ప్రక్కఊరు చూసుకొని పోవడమే. అక్కడికి పూర్తి అవుతుంది!'

'ఎల్లుండి మంచిది కాదు. ఆ మర్నాడు వెళుదురు గాని మీకు అభ్యంతరం లేకపోతే అలాగే చెయ్యవచ్చు!'

'మాకింకా అవుసర కార్యాలున్నాయండి! తిథులు, శకునాలు, చూసుకుంటే ఎలా?'

'చిత్తం! చిత్తం! అలాగే కానియ్యండి......చిన్న మనవి'

'ఏమిటి చెప్పండి. సంకోచం దేనికి? మీరు నాకోసం యింత శ్రమ తీసుకున్నందుకు మీకు నా వీలైనంత సహాయ్యం చెయ్యగలను'

'ఏమీ లేదు చూడండి-! అప్పుడే ముప్ఫై ఏళ్లు దగ్గరపడ్డాయి. ఇంతవరకూ ఏ ఉద్యోగం సద్యోగం ఏమీ లేదు...ఎంత డబ్బుఉండి ఏం ప్రయోజనం మనిషికి గౌరవం అన్నది ఉండాలి కదండి!-అందుకని......'

'ఓ...అదా...ఈ పాటిదానికేనా - నా చేతనైనంత సహాయం చేయడానికి ఏం అభ్యంతరం లేదుగాని చూశారా! ఇప్పుడెలాటి పరిస్థితిలో ఉన్నానో - ఎన్నికల్లో నేను గాని నిలబడకపోయినట్లయితే ఎలాగా అని'

'అయ్యో. మీరు నిలబడకపోవడం ఏమిటి! నిలబడేటట్లు చేద్దాం. ఆ మాత్రం మాట యిస్తే చాలు ఏదో అందరితోపాటు చిన్న పదవిలాటిది.....ఇప్పిస్తే...'

'చెప్పేను కదండి. నేనేగాని యీసారి కూడా యీ స్థానంలోనే వుండినట్లయితే మిమ్మల్ని ఎలాగైనా ఓ మంచి పదవిలోనికి తీసుకువచ్చే ఏర్పాటు చేస్తాను. నన్ను నమ్మండి!'

'చిత్తం! చిత్తం! మీ సంగతి తెలుసులెండి! ఐనా పూరికే జ్ఞాపకం చేశాను-'

'ఆఁ హాఁ! దానికేం లెండి! రాళ్లెత్తాలా గుళ్లు ఎత్తాలా - నా చేతిలో ఉన్న పనికి!'

"చిత్తం అందుకేనండి- మీ చేతిలో ఉన్నపని"

'సరేలెండి తప్పకండా అలాగే-చేద్దాం-'

(38-వ పేజీ చూడండి)

# పెద్దపదవి

(18-వ పేజీ తరువాయి)

## 2

'ఒరే వెంకడూ యిలా రా!' అని రామస్వామి వెంకటేశంగారి బంట్రోతుని పిలిచాడు.

'చిత్తం బాబూ!' అంటూ వచ్చి నిలబడ్డాడు వెంకడు.

'బాబుగారు ఏరిరా!'

'కరణంగారి కాడికి పనుండి వెళ్లినారు బాబూ...'

'అవునుగాని మీ బాబుగోరు చాలా మంచివారిలా ఉన్నారు!'

'ఇంకా అన్నారు! సాలా మంచోరు బాబూ ఎంతమందికి యెన్నెన్ని యిచ్చినారో! బావుగోరు నిజంగా కల్పవృచ్ఛంటోరంటే నమ్మండి బాబూ'

'అలాగా ఆయనకి మనం చేసినవన్నీ నచ్చినయో లేదో నీతో ఏమైనా అన్నారా! చెప్పు ఆయనకేం కావాలో! ఆయనకేం అలవాట్లున్నాయో అలా చేద్దాం మరి మాకెలా తెలుస్తుంది!'

'యింకా నయ్యం బాబూ! ఎంత మాటనేసేరు మీ నాగ యింతవరకూ ఏడూ చేసుండనేదని పొద్దల్లా నాతో సెపుతూనే ఉంటేనే!'

'నిజంగానా వెంకడూ...'

'అవును బాబయ్యా నా యమ్మ మీదొట్టు!.... కాని... బాబయ్యా...'

'ఏఁ వింటిరా చెప్పు ఏమిటో!'

'ఏం నేదుగాని మీకూ తెలుసుంటాది- యీ కాడికే సాలా రోజులాయి యీలకి తిండీ నిద్ర లేక అలసి పోయినారా! అందు కొళ్లంతా నొప్పులెట్టి పోతుండాదిట! అదలా వుంచండి బాబూ! రాత్రి సాగోరే ముందు కొంచెం సుక్కేసుకోడం అలవాటు అది నేక అదోలా వున్నారు!'

'అయితే ముందే చెప్పలేకపోయావురా! ఎంతపని చేశావు! పోనీలే యివాళ తెప్పిస్తానని చెప్పు! అంతేనా!

'అంతేను బాబూ!... ఆఁ...అయితే బాబూ ఒక్క మాటడుగుతాను నిబద్దిగ సెపుతారా బాబూ!'

'ఏమిటి! చెప్పరా! అదేమిటలా అంటావు?'

'ఏం నేదు కాని బావూ మద్దేన్నం ఒడ్డించినారే ఆ యమ్మ ఎవరు బాబూ!'

'ఆఁ! అదేమిటి అలా అడిగేవు. అది నా భార్య! మరెవరూ కారు!'

'అమ్మ బాబూ! ఎంత పని! అమ్మగోరేనా!'

'ఏం అలా అడిగావు!'

'అహఁ...యింతోక మాటోరసని బాబుగోరు అడగమంటే అడిగాను...అంతేను బాబూ.....'

'బాబుగారు అడగమన్నారా?'

'...............'

## 3

ఆఖర్ని తను అడిగినదానికి వెంకడు జబాబు యివ్వకపోవడంవల్ల రామస్వామి ఆలోచనలో పడ్డాడు. ప్రక్కనున్న కుర్చీలో చతికిలపడ్డాడు! నిజంగా వెంకటేశం యిలా అడిగించాడా! అంత పెద్ద మనిషి యిలా ప్రవర్తిస్తాడా! యిందాక తాంబూలం వేసుకొనేటప్పుడుకూడా లక్ష్మిని అదోలా చూసేడు. ఆ వాటం చూస్తే లక్ష్మిని చూస్తే యీాయనకేదో పుట్టినట్టుంది! నిజంగా అలాగే కొంపదీసి దాని మీద మనసు పోలేదుకద! బుడ్డీ అలవాటుందని చల్లగా చెప్పించాడు. ఏమో యీ బుద్ధి కూడా పుట్టిందేమో! యింతకు పూర్వం తను ఎంతమందికి సత్కరించినా యిలా ఎవ్వరూ అడగలేదు! అయినా ఒకరి భార్యని కావాలని అంత సులువుగా అడిగేయటానికి ఎంత గుండెధైర్యం కావాలి? ఎంత పెద్ద పదవిలో ఉన్నా యిదెంత సబబైన పని? ఎంత వీళ్ల వెనకాల తిరిగినా ఎంత పదవికోసం ప్రాకులాడినా భార్యని దానికోసం యిచ్చేస్తాడా? ఛీ! ఎంత నీచం! ఎంత పరువు తక్కువ పని!! యింత సులువుగా భయమైనా లేకండా ఎలా అడగగలిగాడా వెంకటేశం! ఛీఛీ వీడిని నమ్మకూడదు!...కాని...యీాయనక్రింద ఖర్చు చేసిన ఇంత సొమ్మూ వృథా అయిపోవలసిందేనా? అదీకాక ఆయన అంతలా తప్పకండా పదవి యిప్పిస్తానని చెప్పేడు? నిజమే. ఆయన తలచుకొంటే ఏదైనా చేయగలడు...కాని అసభ్యమైన కోరిక కోరేడే! యిదెలా అవుతుంది? ఒకవేళ ఒప్పుగొంటే! నిజమే, తనే ఒప్పుగుండే తప్పు ఏమిటి? భర్త ఒప్పుకున్నపుడు భార్య ఏ పనిచేసినా దోషం లేదు...ఒక్క రాత్రి! పెద్దపదవి!! ఆ తర్వాత ఎంత గౌరవం! ఎంత హాయి!! ఈ సంగతి మరో కంటివాడి కెవడికీ తెలీదు - అంచేత పరవాలేదు! ఒక్క రాత్రి కళ్లు మూసుకుంటే - స్వర్గం! పెద్ద పదవి!! అదీకాక దీనివలన మరో కోర్కె కూడా నెరవేరుతుంది! అది తన భార్యకు మరీ సంతోషం కలుగజేస్తుంది! పిల్లలు లేరన్న కొరత తీరుతుంది!! యీ విధంగానే పిల్లలకోసం సూరినాయుడు చేసిన పని జ్ఞాపకానికి వచ్చింది! తన అదృష్టం కూడా పండితే చక్కనికొడుకు పుడతాడేమో! యీ విధంగా ఆలోచిస్తే తప్పేం కనపడలేదు! అదీకాక తన ఆస్తి! ఎంత ఆస్తి!! పిల్లలు లేకపోతే ఏమౌతుంది! యీ విషయం రామస్వామిని భయపెట్టింది. నిజమే! తనకి పిల్లలు లేకపోతే నిష్కారణంగా ఇంత ఆస్తీ ఊరువాళ్ల పాలవుతుంది! ఇప్పుడు కాకపోతే ఎప్పుడయినా యిందుకోసం తను అధమం దత్తతయినా చేసుకోవాలి! దత్తతచేసుకొనేకన్న యీ విధమే బావుంది! తన పిల్లడు అని చెప్పుకొందికి వీలుంటుంది! తప్పదు! యీ విధం చాలా బావుంది! ఒక్క దెబ్బకి రెండు కోర్కెలూ నెరవేరుతై! సరే! ఒప్పుకుందాం! అని కుర్చీలోంచి లేచాడు!-కాని-మరో విషయం అతడిని యింతకన్నా ఎక్కువగా బాధించింది! ఇంతకీ తన భార్య ఒప్పుకోవద్దూ! ఆమె సంగతి తనకు బాగా తెలుసు. యీ విషయం చెబుతే తననే కాకండా వెంకటేశాన్ని కూడా వీధికీడ్చేస్తుంది! ప్రాణం వదలడానికైనా యిష్టపడుతుంది కాని యిందుకు ఒప్పుకోదు - ఇది నిజం. తను వెళ్లి నచ్చచెప్పడం అన్నది కలలో వార్త! అయితే ఎలా! ఆమె లేనిదే అసలు కాదు!

రామస్వామి సంధిగ్ధంలో పడిపోయి కొట్టుకుంటున్నాడు. తనకి బుర్ర ఏం పనిచేయడం లేదు. ఒళ్లంతా చమట్లుపోసినై. ఏలాగైనా సరే వెంకటేశం కోర్కెచెల్లించి తన రెండు కోర్కెలూ నెరవేర్చుకోడానికి రామస్వామి నిశ్చయించుకున్నాడు! అలా చెయ్యాలంటే రెండే రెండు పద్ధతులు—— ఒకటి—— తన భార్యని ఒప్పించాలి. యిది బ్రహ్మ విష్ణువులు దిగి చెప్పినా కుదరదు... అందుకని ఆ ఆలోచనే వదులుకున్నాడు- రెండోది రాత్రికి తనే వస్తానని చెప్పి ఆమె గదిలోనున్న తర్వాత వెంకటేశాన్ని పంపించాలి యిది బావుందనుకున్నాడు. కాని యిలా చేసిన లోపల జట్టే ఆడితే! ఆమె ఏం చేసినా ఒప్పించి, లోబరుచుకోవటం మీలోనే వుంటుందని చెప్పేయాలి' అనుకొన్నాడు. యీ ఆలోచన తనకి బాగా


గ్యారంటీ చికిత్స

వీర్యవృద్ధి బలం కల్గించి, నపుంసకత్వం పోగొట్టుటకు 45 సం॥ల జగత్ప్రఖ్యాతి చెందిన సంస్థ.

డాక్టర్ రత్నం సన్స్

మలకపేటబిల్డింగ్స్, హైద్రాబాదు.

వచ్చింది. పదవీవ్యామోహంలో పడిన రామస్వామికి యిది ఎంతో మంచి పనిగా తోచింది. కాని అదెంత నీచమైన పనో తెలుసుకోలేకపోయాడు! ఒక్క రాత్రి పూరుకొంటే పెద్ద పదవి వస్తుందనే భావించేడు. తన యీ కార్యం జరిపేటందుకు ప్రయత్నాలు చేయడానికి బయలుదేరాడు.

## 4

'లక్ష్మీ యివాళ ఎంత బావున్నావు!'

'పోదురూ! మీకు బాగులేని నాడు ఎప్పుడు? ఎన్ని రోజులు గడిచినా మీబుద్ధి మారలేదు'

'అదిగో అలా అనే మరిపింతలు పెట్టేస్తున్నావు - ఇవాళ ఏమిటో అదోలా వున్నావు...యింకా చక్కని చీర నగలు అవీ పెట్టుకొంటే ఎంత బావుంటావో!'

'ఇంకా నయం! గౌనూ జోళ్ళూ తొడుక్కోమన్నారు కాదు దొరసానిలా!'

'నీ హాస్యానికేం కాని చెబుదూ'

'ఏమిటి -'

'అదే...బాగా చూస్తాబవాలి!'

'బావుంది సరి!'

'పోనీ ప్రేమగా యివాళ తప్పదు!'

'రాను రాను మరీ చిన్నవాళ్ళైపోతున్నారు!'

'యిదిగో నా మాట వినవుకదూ! ఎలా ఉండాలంటే అలా ఉండాలి చూసేవారికి ఏ జగన్మోహినో అన్నట్టు......'

'చాలండీ! చాలు. యింక ఊరుకొంటే శృతిమించేట్టుంది! యివాళేం యిలా పట్టించారు'

'ఏమీ లేదు! నా మాట వింటావా వినవా?'

'...........'

'అదీ. అలా ఉండాలి! - ఏదీ -'

'ఇస్. ఊరుకుందురూ -'

## 5

'ఒరే వెంకడూ రామస్వామిగారు వీరా'! అన్నాడు వెంకటేశం బంగ్లోతుతో -

'చిత్తం బాబూ, ఆయ నూరికెళ్తానని చెప్పమన్నారు!'

'ఏ వూర్రా! నాతో చెప్పలేదే. చెప్పకుండా వెళ్ళిపోయినాడా!'

'ఏమో బావూ. మరేం మొగమాటం పడ్డన్నారు'

ఏదో అర్జెంటు పనుండి యెళ్ళినారు సీకటి పడకండానే పెందిలికాడే వస్తామన్నారు!'

'సరే యింట్లో మరె వరున్నట్టు!'

'అమ్మగోరున్నారు బావూ అంతే మరెవ్వరూ నేరు!'

'అమ్మగారు ఒక్కరే ఉన్నారా?'

'అవును బాబూ'

ఆ తరువాత వెంకటేశంగారు ఆలోచన్లోపడ్డారు. వెంకడిని తీసుకొని ఎటో వెళ్ళిపోయారు.

## 6

'ఆయనెవరో చూస్తే బావుండదు. మరీ చిన్నవాళ్ళయిపోతారేం యీ ఒక్కనాడుకే...' అని లక్ష్మి తలుపువేసిన చప్పుడు విని ఎవరు వచ్చేరో చూడకుండానే అనేసింది.

"..............."

"యీ చీర బావుంది కదండీ...అని చూస్తూ ఆగిపోయింది! లేచి భయంతో మంచంవెనకాల నిలుచుంది!"

"మీ...రా...!"

'అవును— నేనే....ఏం...లక్ష్మీ—'

"ఆఁ! లక్ష్మి!!...ఎందుకండి?"

నవ్వుతూ వెంకటేశం కొంచం ముందుకి వచ్చేడు. లక్ష్మి కొంచం వెనక్కు జరిగింది.

'దేనికి చెప్పండి?" అని కొంచం గట్టిగా వణుకుతూ అంది.

'ఆఁ! దేనికా... దేనికీ లేదు!...' అంటూ లక్ష్మి పక్కకు వచ్చేడు...

లక్ష్మి దూరంగా పోయి

'అలా ఉండండి!... ఏమిటిదంతా అర్థం కాలేదు'

'అర్థం అవుతుందిలే చెబుతాను రెండు మాటలాడు!'

'ఏమిటి మాటలాడ్డం! ఆయనతో వెళ్ళి మాటాడండి నాతో ఏముందీ!' అని గబగబా తలుపు తీసుకొని వెళ్ళబోయింది కాని వెంకటేశం ఆమె చెయ్యిపట్టుకుని ఆపేశాడు. దీనితో ఆమెకు మరీ కోపం ఎక్కువయింది. యితనేదో అన్యాయం చెయ్యడానికి వచ్చేడని గ్రహించి చెయ్యి విదుల్చుకొని—

'ఏమండీ! మీ ఉద్దేశ్యం ఏమిటో అర్థం కాలేదు మర్యాదగా వెడతారా? ఆయన్ని పిలవమన్నారా?'

మర్యాద కేంలే! మీ ఆయన పిల్చినా పలుకరు...'

యీ మాట వినగానే లక్ష్మి కంపించిపోయింది.

"ఆఁ ఏమిటీ! మా ఆయన్ని ఏంచేశారు? ఆయన ఏరీ..." అని భయపడి పోతూ అంది. వెంకటేశం వచ్చి ఆమెను పట్టుకోనబోయాడు గాని లక్ష్మి ఆయన్ని ఒక్కతోపు తోసేసింది.

'రామస్వామి ఊళ్ళో లేరు. ఆయనే నాతో చెప్పేరు...రా...'

'ఆఁ! ఏమిటీ! ఆయన చెప్పారా... మిమ్మల్ని నాదగ్గరకు వెళ్ళమని చెప్పారా! ఛి, ఎంత నీచం.... ఎంత పాపం...యిలా ఎందర్ని మోసంచేసి ఎంతమందిని అవమానించేరు చెప్పండి! ఆయన్ని ఏం చేశారు... ఏంచేసి నాదగ్గరికి వచ్చేరు!'

"దాని కేంలే. నిన్ను చూస్తే అదోలా అనిపిస్తూంది! యీ ఒక్క రాత్రికీ ఏంకొంప మునిగిపోయింది?'

'మతిపోయి మాటాడుతున్నారు...మీకు పిల్లలు లేరూ? మీకు భార్య లేదూ? ఇదేనా మీ దేశసేవ? యిదేనా మీ పదవి? ఆయన్ని ఏం చేశారు?'

'ఆయనేం చెయ్యలేదు! ప్రక్క ఊరికి వెళ్ళారు పనుండి'

'ఆఁ, ఆయన లేని సమయం చూసి యింత పనికి పూనుకుంటారా? ఇంకా ఎంత మంచివారో అనుకున్నాను - ఛీఛీ, ఇంత నీచం మనసులో ఉందా? మీ పదవులు - మీ తెలివితేటలు - మీ పెత్తనం కాల్చడానికా? మీ కంటికి నేనెలా కనబడుతున్నానని? నన్నింత చులకనగా చూస్తారా? విషాన్ని విషమైనా తాగించవచ్చు గాని భయాన్ని అమృతమైనా తాగించలేరు! తెలుసునా? యింక మర్యాదగా నడవండి. లేదా మీ పరువు మంటలో కలుపుతాను -' అని రోషంతో ఒళ్ళు తెలియక అనేసింది. కాని వెంకటేశం చలించలేదు!

'ఇదుగో చూడూ, యీపాటిదానికే అంత ఇదైతే ఎలా చెప్పు! నీ భర్తకి పెద్ద పదవి యిప్పిస్తాను!! ఆతర్వాత ఎంతో సుఖంగా ఉండండి! ఎవరికీ తెలీదుగా!!'

'ఏమిటీ! పదవి యిప్పిస్తానని పన్నిన మోసమా యిది! మీ పదవి మీరే వుంచుకోండి - యింకా లక్షలకొద్దీ ధనం, పదవి పేరున, సంస్థపేరున, దోచుకోండి. ఆ అన్యాయం బ్రతుకు మీరే బతకండి. మాకవసరం లేదు. ఎంత నీచం అయిన కోరిక కోరుతున్నారో అర్థం కాలేదూ? ఆలోచించండి!- మీ భార్యని మీకన్నా ఎక్కువ అధికారి వచ్చి అడిగితే ఇచ్చేస్తారా? ఆపాటి తెలివి ఉండొద్దూ? యిది మీకోసం కాకపోయినా మీ పదవికోసమైనా మీ కీర్తికోసమైనా తగిన పనేనా?'

'అవన్నీ తెలుసులే నా యీ ఒక్క కోర్కె తీర్చు. ఆతర్వాత నీయిష్టం-నీభర్తకే యిష్టమయినపుడు నీకేం? - ఆతర్వాత ఎంత హోదాగా బ్రతుకుతావో ఆలోచించు!'

‘హోదా! ఆ హోదా నాకక్కరలేదు. నం యిచ్చుకొని మణిహారాలు పెట్టుగొనే కంటె నీతిగా బ్రతికి నల్లపూసలు కట్టుగుంటే మంచిది! యింక నన్ను విడిచి వెళతారా? వెళ్లారా!

‘ఇదుగో నిన్ను వదిలి వెళ్లిపోడానికి లేదు! నెమ్మదిగా విను. లేకపోతే ఎలాగైనాను నీ్వనాడు నాదానివి కాకతప్పదు!’

‘ఆఁ! బలవంతాన్నా—ఛీ—అన్నం తింటున్నావా? గడ్డి తింటున్నావా? నీతో మాటాడ్డం పాపం! అడివిలో మృగాలూ పక్షులూ నీకన్నా నయం. ఎవరినో ఒకరిని ఎంచుకొని చచ్చేవరకూ విడిపోకండా సంసారం చేస్తాయి. నీతిగా బ్రతుకుతాయి యీ నీ తుచ్ఛబుద్ధి మంచిది కాదు!’

‘లక్ష్మీ! నువ్వంటూన్న మాటలన్నీ నాకో ఆనందాన్నిస్తున్నాయి! యీ కోపంలో నీలో అందం ముందడుగు వేస్తోంది!! యిక లాభం లేదు...రా...’

విడువు...విడూ...ఎంత దుర్మార్గం! నవ్వు నన్ను కాదు! ఒక్క హిందూసోదరిని బలవంతం చేస్తున్నావు... దీనివలన ఎంత ముప్పందో ఆలోచించావా?...లే.. వదులు.’

‘ఏమిటా ముప్పు?’

‘రెండురక్తాలుకలిసినచోట బలవంతాన్ని మరో రక్తాన్ని ప్రవేశ పెట్టబోతున్నావు-దానితోపాటు—వంశం! రూపు!! తెలివి తేటలు! మారిపోతాయి పేలవంగా అయిపోయి నిర్వీర్యం అయిపోతాయి.... భారత భావిబాలకులు యిలా తయారవుతూంటే-దేశానికి యింక వాళ్లు సేవ చేసేది ఏమిటి! ఛో నన్ను ముట్టకు - యింత పరస్పర వైరుధ్యంలో నువ్వు బావుకొనే సుఖం ఏమిటి? నామాట విని పోతావా పోవా! లేకపోతే నేనేం చెయ్యావలసి వస్తుందో నాకే భయంగా ఉంది!’

‘లక్ష్మీ! ఆ మాత్రం ఒప్పగుంటే ఏమయింది? యీ అవస్థలో నువ్వేం చెప్పినా నేను వినలేను!—వినను!! నాకు కావలిసింది నువ్వు. యింకా ఆలస్యం చేస్తే మాట దక్కనివ్వను—’

మీద మీద పడుతూ కదలనివ్వకండా బలవంతం చేస్తూన్న వెంకటేశాన్ని యింకేమన్నా వదలడని లక్ష్మి మరో ఉపాయం కోసం ఆలోచించింది. వెంటనే సొమ్మసిల్లి పడిపోయినట్టు నటించింది. వెంకటేశం ఆమెకు సేవచేయడం మొదలెట్టేడు కానిపోవడం లేదు...యింక లాభంలేదని లక్ష్మి కళ్లు తెరిచి—‘ఏమండీ! నామీద మీ కెందుకింత అభిమానం?’ అంది. వెంకటేశం అదవిని పూరిపోయాడు.

‘ఆఁ! ఆఁ!...ఏమిటి...లక్ష్మీ! అభిమానం! యిప్పటికైనా నువ్వు నామీద అభిమానం చూపుతున్నావా?’

‘అవును గాని నిజంగా ఆయన ఒప్పగున్నారా?’

‘నిజంగాను లక్ష్మీ...’

‘...........’

‘లక్ష్మీ’

‘నీరసంగా వుంది...’

‘అయితే కొంతసేపు పడుకో్క’

‘మీరూ పడుకోండి నే లేపుతా—’

‘సరే పడుకోనా?’

# 7

రామస్వామి వెంకడు చెప్పిన కబురు విని రోజుకుంటూ యింటికి పరుగెట్టి వచ్చేడు - కాని లాభం లేకపోయింది—ఇరుగూ పొరుగూ అతని చుట్టూ మూగేరు.

‘రామస్వామీ, ఎక్కడికి పోయావు యింట్లో వుండక!’

‘పనుండి పైవూరు వెళ్ళేను’

‘మంచిపనే చేశావు! ఎవడో ముక్కూ మొహం తెలియనివాడిని నమ్మి యింట్లో వుంచి వెళ్ళిపోతే ఏమౌతుంది. పాపం ఆ యిల్లాలు ఎంత బాధపడిందో లేకపోతే ఎందుకలా చేస్తుంది!’

‘వళ్లు మాస్తా వేమిటి! స్టేషనుకి!’

‘ఆఁ! స్టేషన్కా?’

‘అవును. నీ భార్యని పోలీసులు తీసుకుపోయారు’

‘ఆఁ! పోలీసులు! లక్ష్మిని?..లక్ష్మిని..’ అని అరుస్తూ పోలీసుస్టేషనుకి వెళ్లేడు.

‘లక్ష్మీ...లక్ష్మీ...ఏమిటిది...ఆఁ!’

‘ఏమిటా, తెలియదు పాపం! కదండీ!’

‘ఏఁవిటి లక్ష్మీ...’

‘అదే...పాపానికి ఫలం....ఏ మొహం పెట్టుకువచ్చే రిక్కడికి? వెళ్లిపొండి...... పదవి! పెద్ద పదవి సంపాదించుకోండి!’

‘ఏమిటి?’

‘ఎలాగో అప్పచెప్పేరుగా వెళ్లండి—పదవి సంపాదించుకొని దేశాన్ని ఉద్ధరించండి!’

‘లక్ష్మీ—’

‘నా వూసు ఎత్తవద్దు! పదవికోసం పరువుని పోగొట్టుకున్నాడు - చేతులారా తాళి కట్టి మరొకడికి మీయిష్టం నెరవేరడానికోసం నన్ను ఉపయోగిద్దాం అనుకున్నారు! చేతులారా అప్పచెప్పుకున్నారు...ఎంత నీచం! మీలో ఏది ప్రవేశించి మిమ్మల్నీ నీచానికి చేయి చాచమంది! మీరు నిజంగా మొగవారేనా? భర్త ఆచరించవలసిన విధియిదేనా? ఎంత సిగ్గులేదూ? ఇంక మీదగ్గర సంసారం చేసేకన్న నాకీ జైలు జీవితమే బావుంది! వెళ్లిపొండి...వెళ్ళిపొండి...’

‘ఏమిటి దంతా లక్ష్మీ...ఏమిటయింది?’

‘ఏమిటయిందా? ఇదిగో యీ చేతులారా మీ కళ్లకి వరాలిచ్చే దేముడులా కనబడే మీ పెన్నిధిని-మీ యిష్టదేవతని—పరోపకారంకోసం తుచ్ఛమైన ప్రతిఫలం కోరిన పెద్ద మనిషిని...మీ రింట్లోలేని సమయంలో మీచేతనే ప్రోత్సహింపబడి నన్ను బాధించిన నీచుణ్ణి—ఆ వెంకటేశాన్ని యీ చేతుల్తో విషం యిచ్చి చంపాను! అందుకే నాకీ శిక్ష-వెళ్లండి నాగురించి మీ రేమీ చేయనక్కరలేదు - విచారించ నక్కరలేదు వెళ్లండి - నాకింకా కోపం తెప్పించకండి—’

‘లక్ష్మీ...లక్ష్మీ...’ అని రామస్వామి గట్టిగా అరిచాడు. సర్కిల్ యిన్స్పెక్టర్ దగ్గరికి వెళ్ళాడు—

‘ఇన్స్పెక్టర్ గారూ, ఆమె దేం తప్పలేదు - తప్పంతా నాది. నన్ను బంధించండి!’

‘అదేమిటి రామస్వామిగారూ, విషం తనే యిచ్చినట్టు ఒప్పగుంటున్నారే- విషం యిచ్చినట్టు రుజువు అవుతూందే - యిదేమిటి?’

‘అవును. దీని కంతా కారణం నేను—పదవీవ్యామోహంలో పడిన నాకు కళ్లు కన్పించలేదు - పరువు, ప్రతిష్ఠ, నీతి - ఆఖరికి నా భార్య మానంకూడా కన్పించలేదు. పదవి యిప్పిస్తానంటే నా భార్యని ఆయనకు యిచ్చి ఆయనకోర్క తీర్చడానికి ఒప్పగున్నాను. నే నుంటే వీలుండదని ఏదో నెపంమీద పైవూరు పోయాను... కాని లక్ష్మి—హిందూస్త్రీ విధిని నిర్వర్తించింది. ఆయన బలవంతించేస్తే విషం యిచ్చి ఆమె చంపవచ్చు. కాని దీనికి మూలకారణం నేను...నాకా శిక్ష విధి—’

‘రామస్వామిగారూ క్షమించాలి! విచారణకి ప్రత్యక్షమైన రుజువులతోనే, సాక్ష్యాలతోనే పనిగాని లోపలి విషయాలు అక్కరలేదు—పోలీసులకి చెవులేగాని కళ్లు ప్రధానంకాదు!—అదీ కాక మీరు యీ హత్యజరిగినపుడు పైవూర్లో ఉన్నారని మీరే అంటున్నారు—మూకంతకన్నా కావలసిన విషయం లేదు—మీ భార్యయే స్వయంగా చంపేనని ఒప్పగుంటున్నారు—అదికాక ఆ స్థలంలో వారిద్దరూ తప్ప మరొకరు లేరు—అంత పెద్ద మనిషిని చంపడానికి మరెవరికీ—మరే కారణంకూడా కనపడదు—అందుచేత క్షమించండి’

# సాహిత్య సింహావలోకనం

గత సంవత్సర తెలుగు సాహిత్యాన్ని సింహావలోకనం చేస్తుంటే అనేక ఉత్తమ రచనలు పొడసూపక పోవు. అందులో కొద్ది మంది రచయితలే యథార్థాలని చిత్రిస్తూ జీవితాలను ప్రతిబింబింపచేస్తూ పాఠకుల హృదయాలను హత్తుకోగలుగుతారు. అలాంటి రచయితలలో శ్రీ "శార్వరి", "హితశ్రీ" భరద్వాజులు ముఖ్యులుగా తోస్తుంది.

ప్రత్యేకించి శ్రీ శార్వరిగారి రచనలు హృదయంగమంగా ఆకర్షణీయంగా యథార్థానికి అతి సాన్నిహిత్యంగా ఉండి జీవితాలనే ప్రతిబింబించటం చూడగలుగుతాం. ఉదాహరణకు "విజయప్రభ"లో సీరియల్‌గా ప్రచురితమైన "ఎండమావులు" నవల. ఈ నవలలోని కథానాయకుడు భగవాన్ చాలామంది యువకులకు ప్రతిబింబం. ప్రేమించి, ఆశించి, కోల్పోయిన జీవితం భగవాన్‌ది. ఇందులో ఒక భగవాన్ జీవితమే కాక మనకు పరిచయమయ్యే ప్రతివ్యక్తి—ప్రతి కుటుంబంలోని ఒక వ్యక్తిలో అణగారిన ఆశలని, కోరికలని, చివరకు రూపాన్ని రూపించి, నిరూపించి, నేనేనా ఈ నవలలోని పాత్ర అని అనిపిస్తుంది. ఇంత సమోగ్రహకజనకంగా సామాన్యమానవ మనస్తత్వాన్ని కథకరించటం, పోషించటం శార్వరి గారి ప్రత్యేక నిపుణతను తెలియచేస్తుంది.

వీరి ఇతర కథలలో గత సంవత్సరంలో "తెలుగు స్వతంత్ర"లో ప్రచురితమైన "రావలసిన భావవిప్లవం" అభ్యుదయ నిరోధక రచయితలపాలిటి సమ్మెటపెట్టు. ఈనాడు సంఘంలో అణగారిపోయిన శ్రామికజీవితాన్ని, విప్లవశక్తుల్ని ఉత్పన్నింపించి, శ్రామికలోకంలో క్రొత్తరక్తాన్ని పులకింపచేసింది. పాఠకలోకాన్ని పులకరింపచేసింది. వీరి "చర్విత చర్వణం"లాంటి కథ ఒక్క ఆంధ్రదేశంలోనే కాదు. ఇంతవరకు విశ్వసాహిత్యంలోనే లేదని చెప్పక తప్పదు. దానికదే సాటి. అందులో కిష్టుడు నిరుద్యోగిగా ఉండి అనేక కష్టాలకు నష్టాలకులోనై మధ్యతరగతి మనస్తత్వాల్ని సామాన్య నిరుద్యోగుల ఆశయాలను, అనుభూతుల్ని రెచ్చగొట్టి, తనకు తానే ప్రతిబింబమయినాడు. ఈనాడు దేశంలో కిష్టుడులాంటి వ్యక్తులు ఒకరు కాదు ఇద్దరు కాదు. వేల లక్షలసంఖ్యలో ఉన్నారని మనందరికీ తెలిసిన విషయమే. అందరిలోని ఆవేదనలకు ప్రతిబింబమే "చర్విత చరణం".

గొంది విజయరామయ్య
తెనాలి.

---

1950 వ సంవత్సరంలో నేను చదివిన కథలు, వ్యాసాలలో, "భారతి"లో ప్రచురించబడిన "రాగమయిం" "అన్నపూర్ణ." ఇవి నాకునచ్చినవి.

కాళీపట్నపు రామారావుగారి "రాగమయి" బలివాడ కాంతారావు గారి "అన్నపూర్ణ" ఇవి రెండూ ఒక్క పోలిక నే నడిచాయి. ఈ రెంటిలోనూ ప్రధాన ఇతివృత్తం ఒకటే, సామాన్య మధ్య తరగతికుటుంబాలలోగలిగే అంతఃకలహాలూ, దాని నివారణాను. ఈ రెండుకథానికలలోనూ ఇంటికి వచ్చిన పెద్దదోడలిపాత్రే అతిముఖ్యమయింది. రాగమయిలోని "ఉమా" అన్నపూర్ణలోని "అన్నపూర్ణా" పాత్రలు ఒకదానికొకటి తీసిపోవు. ఈ రెండు కథలు చదువుతున్నంతసేపు మనంకూడా ఆకథల్లోని పాత్రలలో ఒకరనీ మనకుకూడాఆసంఘటనలో ప్రధానపాత్ర ఉన్నదనిఅనిపిస్తుంది.

ఈ కథానికలను తెలుగుపాఠక లోకానికి అర్పించి సాహిత్యసేవ చేసిన రచయిత లెంతయినా అభినందనీయులు.

కె. వి. సత్యం, పాతపాళ్యం.

---

## గ్రంథస్వీకారం

### "తెలంగాణా తిరుతెన్నులు"

రచన : "భవదీయుడు."

ప్రచురణ : జనపదప్రచురణలు, ఎ-9. 349 నారాయణగూడ, హైదరాబాద్.

వెల : రూపాయి.

---

### "ఆధునిక విజ్ఞానం"

ప్రచురణ: సయన్సుసర్వీసు (ఇండియా) మద్రాసు 6.

---


ఉత్తమ శైవమత గ్రంథము

**పండితారాధ్యచరిత్ర**

పాల్కురికి సోమనాథకవి రచించిన ఉత్తమ ద్విపద కావ్యము.

డా. చిలుకూరి నారాయణరావు గారిచే పరిష్కరింప బడినది. దీక్ష, పురాతన, వాద, మహిమ, పర్వతములను అయిదు ప్రకరణములును ఒకే సంపుటమున గలవు. ఇంత నిర్దుష్టముగ ఈ గ్రంథము నిదివర కెవ్వరును ప్రచురించుయుండలేదు. నారాయణరావు గారు రచించిన అమూల్యమైన పీఠిక కలదు.

**వెల రు 5-0-0 లు.**

ప్యాకింగు పోస్టేజి 1—4—0

**ఆంధ్రగ్రంథమాల,**

పోస్టుబాక్సు 212, మదరాసు 1.


---

'అం! ఏమన్నారూ?...లాభం లేదూ—బాలక్ష్మి నాకు రాదూ?...అవును రాదు! రాదు!! నా పాపానికి తగినశిక్ష యిదే. యింతకు వేరే యినపగజాల్లో ఉండనక్కరలేదు. యిలా కృశించి—కుళ్ళి చస్తాను...చాలు—చాలు—

'లక్ష్మీ...లక్ష్మీ...అంటూ రామస్వామి ఒళ్లు తెలియకండా అరుచుకుంటూ ఎటో వెళ్లిపోయాడు...

'లక్ష్మీ...అన్న కేకకి లక్ష్మి అటువైపు చూసింది! గుండె తరుక్కుపోయింది. వస్తూన్న దుఃఖాన్ని ఆపుగోలేక వెక్కి వెక్కి ఏడ్చింది యినపగజాల్ని పట్టుగోని. కంటికి కనుపడేవరకూ భర్తని చూస్తూ ఉండిపోయింది!

## 8

మరి కొంతకాలానికి పిచ్చాసుపత్రి ఆవరణలో యీ మాటలు తరుచూ వినపడుతున్నాయి—'పదవి! పదవి!! బలే! ఎటువంటి పదవి...నాకు తగిన పదవి దొరికింది—నీ శాపం నాకీ శిక్ష విధించిందేమో! అవును... నా దురాశకి నాకీ శిక్ష యింకా చాలదు!...లక్ష్మీ...వెంకటేశం, బూర్జువా! నిన్ను నమ్మి నా గొంతుక కోసుకున్నాను...నీలో ఏంతకుల్లుంది! నీలాటివాళ్లింకా ఎంతమందున్నారో! అహ్హాహా...నీకూ నాకూ తగిన ప్రాయశ్చిత్తం అయింది...ఛస్తాను చస్తాను...పోండి... యింతమంది పిచ్చివాళ్లలో నే నొకణ్ణి... అహాహా...పిచ్చివాణ్ణి...ఒరే...పిచ్చి...వెళ్లి కారు తీసుకురా...ఒరే వెంకన్నా...నువ్వెళ్లి టీ పార్టీకి ఎరేంజి చెయ్యి...ఊఁ...వెళ్లండి నేను పెద్దపదవిలో వున్నాను... నామాట వినకపోతే చూడండి—మీ కందరికీ నేను మంత్రిని...అహాహా...మంత్రిని.. నేను...మంత్రిని!...